క్లుప్తంగా

మహిళలు విద్యావంతులవ్వాలి

సైదాపురం : మహిళలు విద్యావంతులవ్వాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహిళలకు నిర్వహించిన పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 733 మందికి 49 కేంద్రాల్లో అక్షరాస్యత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఉండే ప్రతి మహిళా అక్షరాలు రాయడం, చదవడం నేర్చుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈవోపీఆర్డీ రాఘవేంద్ర, ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సూళ్లూరుపేట : పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి తేరే సూర్య మాట్లాడుతూ చిన్నతనంలోనే దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను నెరవేర్చేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తడలో..

తడ: మండల కేంద్రమైన తడలో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని జరుపుకున్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం

ఓజిలి: మండలంలోని వెంకటరెడ్డిపాళెం పంచాయతీ రాజుపాళెంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీరోడ్డు నిర్మించాలని జెడ్పీటీసీ రవీంద్రరాజును వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఏ అఖిల్‌రెడ్డి కోరారు. స్పందించిన ఆయన జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మతో మాట్లాడి రూ.5 లక్షలు మంజూరు చేయించారు.

బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఆదివారం పోలీసు బందోబస్తు మధ్య పల్లె పండుగ కింద సీసీ రోడ్డు వేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకొండలో తాగునీటి బావి వద్దకు రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. బావి సమీపంలో తన భూమిలో రోడ్డు ఎలా వేస్తారని గ్రామస్తుడు కోర్టును ఆశ్రయించాడు. పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోర్టు రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అధికారులు రికార్డులను పరిశీలించి గ్రామ నుంచి బావి వద్దకు దారి ఉందని కోర్టుకు తెలిపారు. కోర్టు ఆదేశాలతో రోడ్డు వేయడానికి తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం చర్యలు తీసుకున్నారు. గ్రామస్తుడు మరోసారి పనులకు ఆటంకం కలిగించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని పనిపూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, చిల్లకూరు ఏఎస్ఐలు సిరాజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఘటోత్సవం



ఘటోత్సవం నిర్వహిస్తున్న పనిబాపలోళ్లు (ఫైల్)

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయ అనుబంధ పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఘటోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తొలుత ముత్యాలమ్మ ఆలయ అర్చకులు చాకిరి రమణయ్య ఇంటి నుంచి ఘటోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఐదు కుటుంబాలకు ఘటం కుండలు వెళ్లి చద్దీ పోయించుకుని తిరిగి వారి ఇంటి వద్ద నిద్ర చేశారు. సోమవారం ఉదయం పనిబాపల వారు ఘటం కుండను నెత్తిన పెట్టుకుని పంచాయతీలోని కొమవారిపాళెం, పోసిన వారిపాళెం, ఈదుల వారిపాళెం గ్రామాల్లో ఎంపిక చేసిన వారి ఇళ్లకు వెళ్లి చద్ది పోయించుకుంటారు. తదుపరి తిరిగి మంగళవారం రాత్రికి కనుపూరుకు చేరుకుంటారు. తర్వాత చాకలి ఇంట ఘటం కుండలు దించి పోలేరమ్మ ప్రతిమను కుమ్మరి ఇంట తయారు చేయించే ప్రక్రియ మొదలు పెడతారు. ఈ ఘటోత్సవం నిర్వహించే సమయంలో గ్రామంలోని వారంతా కలసి మెలసి కిలారింపులతో ఉత్సవాన్ని జరుపుకుంటారు.

డి.వడ్డిపల్లిలో పల్లె నిద్ర

దక్కిలి : ఎస్ఐ శివశంకర్ ఆదివారం రాత్రి డి.వడ్డిపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో చోరీలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మహిళలు, గ్రామ పెద్దలకు చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరా తీశారు.

అంతిమయాత్రకు అగచాట్లు

పెళ్లకూరు మండలంలోని పలు పంచాయతీల్లో అంతిమ సంస్కారాలు చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదు. శ్మశానవాటికల్లో కనీస వసతులు లేవు. కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వాగులు, వంకలు, పొలాల మధ్య గుండా మృతదేహాలను తరలించాల్సి వస్తోంది. శ్మశానవాటికల్లో వసతులు కల్పించాలని, రోడ్డు వేయాలని పలుమార్లు కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానానికి దారిలేక వ్యవసాయ పొలాల మీదుగా శవాన్ని తీసుకెళుతున్న దృశ్యం(ఫైల్)



- అసంపూర్తిగా శ్మశానవాటిక పనులు
- కరువైన రోడ్డు
- పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు: ప్రతి శ్మశానవాటికలోనూ మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాట నీటి మీద రాతలా మారిపోయింది. పనులు చేయడంలో పాలకులు జాప్యం చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పెళ్లకూరు మండలంలోని 24 పంచాయతీల్లో శిరసనంబేడు, అనకవోలు గ్రామాల్లో మాత్ర మే శ్మశానాలను బాగు చేవారు. మిగిలిన వాటిని వది లేశారు. తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, నందిమాల, అర్ధమాల, చావలి, పాలచ్చూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, రావులపాడు, పునబాక, జీలపాటూరు గ్రామాలకు చెందిన శ్మశానవాటికల్లో అభివృద్ధి పనుల ఊసేలేదు. గతంలో 22 పంచాయతీల్లో శ్మశానవాటికల్లో అభివృద్ధి చేయడానికి రూ.10 లక్షల చొప్పున రూ.2.20 కోట్లు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కూటమి నేత లు అసంపూర్తిగా వదిలేసి నిధులను స్వాహా చేశారు.





పొలాల మీదుగా శవాన్ని తీసుకెళుతున్న దృశ్యం(ఫైల్), కానూరులో అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక

దారి ఆక్రమణ

పెళ్లకూరులోని పాత దళితవాడ నుంచి శ్మశానానికి దారి లేకపోవడంతో మృతదేహాలను భుజాల మీద మోసుకుంటూ వ్యవసాయ పొలం గట్లపై అతి కష్టం మీద వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రావులపాడులో శ్మశానం పరిస్థితి అంతే. కానూరు అరుంధతీ కాలనీ శ్మశాన దారిని స్థానికేతరులు ఆక్రమించుకున్నారు. దీంతో స్థానికులు మృతదేహాలను వంక గుండా తీసుకెళ్లాల్సి వస్తోంది. దారి ఆక్రమణపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎగువచావలి, చెంబడిపాళెం గ్రామాల శ్మశానవాటిక రోడ్లను స్థానికులు ఆక్రమించుకుని వ్యవసాయ పొలాల్లో కలిపేసుకున్నారు. అలాగే చిల్లకూరు, అక్కగారిపేట, నందిమాల, కిష్టప్పకండ్రిగ, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, జీలపాటూరు తదితర గ్రామాల్లో శ్మశానవాటికలు లేవు. దీంతో ఎవరైనా చనిపోతే వారికి వంక గట్లు, చెరువు మరవల్లోనూ దహన సంస్కారాలు కొనసాగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు, దారి ఆక్రమణ గురించి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్లే పనులు చేపట్టడం లేదన్న ఆరోపణలు వున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కష్టాలు తప్పడం లేదు



మా గ్రామానికి చెందిన శ్మశానవాటికలో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం రోడ్డు కూడా లేదు. ఎవరైనా చనిపోతే మృతదేహాలను చలా దూరం మోసుకుని వెళ్లాల్సి వస్తోంది. పుట్టెడు దుఃఖంలోనూ బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అక్కుపల్లి రమణయ్య, రావులపాడు

శ్మశానవాటిక పనులు పూర్తి చేయాలి



శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి. చాలా ఏళ్ల నుంచి ఉన్న దారిని రైతులు ఆక్రమించుకుని తమ పొలాల్లోకి కలిపేసుకున్నారు. పొలాల గట్ల మీదుగా మృతదేహాలను తీసుకెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చర్యలు చేపట్టాలి.

– మద్దు రామ్మూర్తి, రావులపాడు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సూళ్లూరుపేట : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నేడు హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం హుండీలోని కానుకలను లెక్కించనున్నట్టు ఏసీ, ఈవో బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు పంచె, బనియన్ ధరించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పేదలకు ఫల సరుకుల పంపిణీ

చిల్లకూరు/గూడూరు రూరల్ : సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులు అందజేస్తున్నట్టు గుణ్ణం సేవా ట్రస్టు ప్రతినిధి రవీంద్రరెడ్డి తెలిపారు. గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆదివారం 25 కుటుంబాల వారికి నెలకు సరిపడా ఫల సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా పేద పిల్లల విద్యకు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజేంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. కుజదోషం ఉన్న వారు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శాంతి కల్యాణానికి వరదయ్యపాళెంకు ధరణి ఉభయకర్తగా వ్యవహరించారు. అర్చకుడు మూలంరాజు బాణుప్రకాష్ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

పోలేరమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు : లక్షలాది భక్తులు హాజరయ్యే తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయ అనుబంధ పోలేరమ్మ జాతరకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్టు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ తెలిపారు. ఆయన ఆదివారం జాతర ఏర్పాట్లపై అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాతర నాలుగు రోజులు జరుగుతుందన్నారు. ఇక్కడికి ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటిని కోరినేషన్ చేసి భక్తులకు అందజేయాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. రెండు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. మద్యం విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. మూడు మార్గాల్లో చెక్ పోస్టులు పెట్టాలన్నారు. బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ జాతర నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ముగ్గురు సభ్యులతో కూడిన సేవా కమిటీని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఈవో నవీన్‌కుమార్, గూడూరు డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రికెట్ టోర్నమెంట్ విజేత గూడూరు జట్టు



గూడూరు రైల్వే ఉద్యోగుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రైల్వే అధికారులు



రన్నర్‌గా నిలిచిన సూళ్లూరుపేట సెక్షన్ రైల్వే ఉద్యోగులకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : దక్షిణ రైల్వే ఉద్యోగులకు ఆదివారం నిర్వహించిన ఫ్రెండ్షిప్ రైల్వే క్రికెట్ టోర్నమెంట్స్ ఫైనల్‌లో గూడూరు రైల్వే ఉద్యోగుల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా సూళ్లూరుపేట సెక్షన్ రైల్వే ఉద్యోగుల జట్టు నిలిచింది. స్థానిక ఏఎల్‌సీఎం మైదానంలో శని, ఆదివారాల్లో నెల రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించారు. దక్షిణ రైల్వే డివిజన్‌లోని పొన్నేరి నుంచి గూడూరు రైల్వే స్టేషన్లలో పనిచేసే ఉద్యోగులు 20 టీములుగా ఏర్పడి ఫ్రెండ్షిప్ టోర్నమెంట్‌లో తలపడ్డారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు ట్రోఫీలను టోర్నమెంట్ చైర్మన్ పెదపరియ ఎస్ఎం అలెగ్జాండర్, దక్షిణ రైల్వే ఎస్ఎంఆర్‌లు రంజిత్ కుమార్, ట్రోఫీ ఆలమ్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు షేక్ నజీర్, సీహెచ్ ప్రసాద్ అందజేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు, అంపైర్లకు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్న క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు

కోట: మండలంలోని కొక్కుపాడు మలుపు వద్ద ఆదివారం బైక్ బోల్తాపడడంతో ఇద్దరు గాయపడ్డారు. నాయుడుపేటకు చెందిన రవి, ప్రసన్న తూర్పుకనుపూరుకు బైక్‌లో బయలుదేరారు. కొక్కుపాడు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన ఇద్దరినీ స్థానికులు ఆటోలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి సమీపంలో ఆదివారం బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట ప్రాంతానికి చెందిన బాషా బైక్‌పై దొరవారిసత్రం వచ్చాడు. తిరిగి వెళుతుండగా నెలబల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన బాషాను స్థానిక పోలీసులు నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్– క్రాస్ రోడ్డు మధ్యలో భాష్యం, నారాయణ పాఠశాలల సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఈ నెల 20న సాక్షి దినపత్రికలో 'కనిపించని స్పీడ్ బ్రేకర్లు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.





నారాయణ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు, భాష్యం పాఠశాల వద్ద..

చలివేంద్రాలు ఏర్పాటు



సూళ్లూరుపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సూళ్లూరుపేట : ఎండలు తీవ్రం కావడంతో సూళ్లూరుపేట పట్టణంలోని ఐదు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తెలిపారు. హోలీక్రాస్ జంక్షన్, షార్ వై జంక్షన్, వినాయకుడిగుడి సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, శ్రీ చెంగాళమ్మ ఆలయం వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏప్రిల్, మేనెలల్లో ఎండలు ఇంకా పెరిగే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రజలతో పాటు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు జనసంచారం వున్న కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ సమీపంలో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రమణ్యం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. డాక్టర్ రోహిణి సుమారు వెయ్యి మందికి మజ్జిగ, గుగ్గిల్లు, పులిహోర అందజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, పూడి విజయకుమార్, హరిబాబు, ప్రభాకర్, విశ్రాంత ఎస్ఐ ప్రభాకర్, వెంకట కృష్ణయ్య, నాగరాజు, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సూళ్లూరుపేట : రక్తదానం ప్రాణదానంతో సమానమని చిరంజీవి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. వారు ఆదివారం సినీ నటుడు రామ్‌చరణ్ తేజ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మెగా అభిమానులు సుమారు వందమంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో చిరంజీవి సేవా సంఘం సభ్యులు మాబాషా, హేమంత్‌కుమార్‌శర్మ, హరిబాబు, కోటి యాదవ్, తేజయాదవ్, రమణ, దాస్, శ్రీమాన్, భాను, సాయి, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లలో తాటికల్లు



తాటిచెట్టుకు బాటిల్లు అమర్చిన కల్లుగీత కార్మికులు

చిట్టమూరు : కల్లు గీత కార్మికులు కల్లు గీసే సమయంలో మట్టి కుండలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగిస్తున్నారు. మండలంలోని సూళ్లూరుపేట– కోట రోడ్డులోని తాడిమేడు గ్రామ పొలాల్లో కల్లుగీత కార్మికులు తాటి చెట్లకు బాటిళ్లు కట్టారు. ఆ దారిన వెళ్లే వారు బాటిళ్లను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సిలికా భూముల్లో పంటల సాగు



గతంలో బీడుగా ఉన్న భూములు



నేడు పచ్చని పంటగా మారిన సిలికా భూములు

చిల్లకూరు : చిల్లకూరు, కోట మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో వేల ఎకరాల సిలికా(ఇసుక) భూములు ఉన్నాయి. వాటిని గతంలో గనులకు లీజు ఇచ్చారు. ప్రస్తుతం లీజు ముగియడంతో భూములు నిరుపయోగంగా మారాయి. వాటిని లీజుదారులు సమీప గ్రామాల్లోని రైతులకు కౌలుకు ఇస్తున్నారు. ఎందుకూ పనికి రాకుండా పోయిన భూముల్లో ఒండ్రు మట్టిని తోలుకుని పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగను మూడు దఫాలుగా పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. గతంలో సిలికా(ఇసుక)తో కూడిన బీడు భూములు కనిపించేవి. నేడు భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి.

పార్టీ అభ్యున్నతికి సమష్టిగా పనిచేద్దాం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమీక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : పార్టీ అభ్యున్నతికి సమష్టిగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం వెంకటగిరిలోని తన నివాసంలో వెంకటగిరి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పనిచేస్తోందని తెలిపారు. పేద ప్రజలకు ఎళ్లవేళలా అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వ ఒత్తిళ్లకు భయపడకుండా ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.

నేదురుమల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాపూరు: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం వెంకటగిరిలో రాపూరు నాయకులు కలిశారు. వైద్యుల విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ ఖాదర్‌బాషాను ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

వైస్ చైర్మన్, కౌన్సిలర్‌కు పరామర్శ

వెంకటగిరి రూరల్ : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వెంకటగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్యను ఆదివారం వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి సోదరుడు చిల్లకూరు జ్యోతిష్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన నేదురుమల్లి కౌన్సిలర్ ఇంటికి చేరుకుని జ్యోతిష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళ్యాణి, రాజారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, వహిదా, శివ, ఆటంబాకం శ్రీనివాసులు పాల్గొన్నారు.



చిల్లకూరు జ్యోతిష్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్యతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దారి కోసం బ్రాహ్మణపల్లి రైతుల ఆందోళన



వరిపంట నూర్పిడికి దారి సౌకర్యం కల్పించాలని కోరుతున్న రైతులు

కలువాయి(సైదాపురం) : తమ పొలంలోకి వరికోత మిషన్ వెళ్లేందుకు దారి ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కలువాయి మండలం బ్రాహ్మణపల్లిలో సుమారు 50 ఎకరాల్లో వరిపంట సాగు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం పంట కోత కోయాల్సి ఉందన్నారు. కోత కోసేందుకు వరికోత యంత్రాన్ని 10 రోజుల క్రితం పిలిపించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన మంగళ చిన్నయ్య వరికోత మిషన్ వెళ్లకూడదని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాలతో ఆర్ఐ, వీఆర్వోలు పొలం వద్దకు వచ్చి దారి ఇవ్వాలని చిన్నయ్యను అడిగారని తెలిపారు. అతను వారిపై దుర్భాషలాడాడని తెలిపారు. ప్రస్తుతం మబ్బులు పడుతున్నాయని, వర్షం పడితే పంట దెబ్బతింటుందని వాపోయారు. దీనిపై ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ



పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్ వర్క్ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరులోని షాదీ మంజిల్‌లో ఆదివారం మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 160 మంది నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. నెట్ వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహబూబ్ బాషా, పెద్ద మసీదు ఇమామ్ హారున్, నెట్ వర్క్ సభ్యులు షేక్ రఫీ, బాబర్, అన్వర్, గోల్డ్ నాజర్, అలీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.